ప్రజాశక్తి

ఆదివారం 9 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నిబంధనలు బేఖాతర్!

అక్రమంగా ఇసుక తవ్వకాలు - తగ్గని ధరలు - పెరగని నిర్మాణాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇసుక సరఫరా అస్తవ్యస్తంగా మారింది. నిబంధనలు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం కేవలం ఆదాయం రాబడి మాత్రమే చూసుకోవడం తప్ప నిబంధనల అమలు గురించి పట్టించుకోవడం లేదు. అమరావతి మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదిలో మూడు రోడ్లు నిర్మించారు. నదిలో రోడ్లు నిర్మించడం సంచలనం సృష్టించింది. వైకుంఠపురం, అమరావతి, ముత్తాయపాలెంలో రోడ్డువేసి ఇసుకను నదిలోనుంచి బయటకు తీసుకువస్తున్నారు. అలాగే భారీ యంత్రాలతో నదీ గర్భంలో కూడా ఇసుక తవ్వకాలు జరుగు తున్నాయి. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులకు భిన్నంగా తవ్వకాలు జరుగుతున్నాయి. గతంలో ఉన్న జెపి ఇన్‌ఫ్రా స్థానంలో జిల్లాకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరుగుతున్నాయి. నెలకు రూ.20 కోట్లకు పైగా విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఎంత ఇసుక తవ్వుతున్నారనే అంశంపై ఎక్కడా సరైన రికార్డులు లేవు. గత నాలుగేళ్లుగా ఇసుక సంక్షోభం వల్ల నిర్మాణ రంగం ఇప్పటికీ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. గత ప్రభుత్వ హయంలో ఉచిత ఇసుక విధానం వల్ల ప్రజలకు కేవలం రవాణాఛార్జీలు మాత్రమే భరిస్తే సరిపోయేది. 2019 జూన్ వరకు ఉమ్మడి జిల్లాలో ట్రాక్టరు ఇసుక రూ.1500 నుంచి రూ.2000 చెల్లిస్తే దొరికేది. 2019 జులై నుంచి ఇసుక విధానం మార్చారు. అప్పటి నుంచి ఈ విధానాంలో ఎన్నో మార్పులు చేసినా ప్రజలు సంతృప్తికరంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గ్రామాలకు చేరే సరికి రీచ్‌లకు సమీపంలో ఉన్న వారికి సైతం ట్రాక్టరు ఇసుక రూ.4వేల నుంచి రూ.5వేలు చెల్లించాల్సి వస్తుంది. అలాగే లారీ ఇసుక రూ.20 నుంచి రూ.25 వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. జిల్లాలో ఎక్కడైనా ఇసుక టన్ను రూ.475కి విక్రయించాలని ప్రభుత్వం చెబుతుండగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. రవాణా ఛార్జీలతో కలిపి ప్రభుత్వం నిర్ధేశించిన ధర కంటే బాగా ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఇసుక సరఫరాలో మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో కృష్ణా పరివాహక ప్రాంతంలోని వివిధ రీచ్‌ల నుంచి ఇసుక తీసే భాధ్యత ను వైసిపికి చెందిన కృష్ణా, గుంటూరు జిల్లా నాయకులే నిర్వహిస్తున్నారు. గతంలో చెన్నైకి చెందిన జెపి సంస్థకు అప్పగించారు. వారి పేరున కాంట్రాక్టు కొనసాగుతున్నా వైసిపి నేతలే ఇసుక రీచ్‌లను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో మాదిరిగానే రవాణా ఛార్జీలతోపాటు ప్రభుత్వం నిర్ధేశించిన ధర కన్నా అదనపు వసూళ్లుకొనసాగుతున్నాయి. అమరావతి సమీపంలో ఉన్న గ్రామాలకు సైతం మూడు టన్నుల ట్రాక్టర్ ఇసుక ధర రూ. 4వేల వరకు పలుకుతుంది. పెదకూరపాడు నియోజకవర్గంలో టన్ను ఇసుక ధర రూ.565గా నిర్ణయించారు. వాహనం సమకూర్చుకోవడం, రీచ్ వద్దకు వెళ్లి ఇసుక తెచ్చుకోవడం సామాన్యులకు ప్రయాసగా మారడంతో గ్రామాల్లో ప్రజలు దళారీలను ఆశ్రయించక తప్పడంలేదు. రవాణా ఛార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారని

2లో

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

టెన్త్ పరీక్షా కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక స్తంభాలగరువులోని మున్సిపల్ కార్పోరేషన్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. విద్యార్ధులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా విద్యాశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు 230 మంది విద్యార్ధులు హాజరఅయ్యారని, ఎవ్వరూ గైర్హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు.కలెక్టర్ వెంట ఎంఇఒ ఖుద్దూస్, గుంటూరు పశ్చిమ మండల తాసిల్దార్ సాంబశివరావు పాల్గొన్నారు.కాగా జిల్లా వ్యాప్తంగా 138 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 26,379 మందికిగాను 26213 మంది హాజరయ్యారు. 166 మంది గైర్హాజరయ్యారు.

లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడు అరెస్టు

2లో

కొండవీటి వాగును కప్పేసిన తూటుకాడ, గుర్రపుడెక్క

5లో

అమరావతిలో 144 సెక్షన్

నేడు అమరలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద చర్చకు సిద్ధమంటున్న మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యేలు

అమరావతిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు

వార్త మెయిన్‌లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం) : 6.27

సహరీ(సోమవారం ఉదయం) : 4.40

8వ తరగతి ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబ్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు ట్యాబ్స్ అందచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. బైజూస్ కంటెంట్‌పై అవగాహన, వినియోగంపై ఈనెల 11న వెబెక్స్ ద్వారా 5356 మందికి ఐదు వేర్వేరు సమయాలలో జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ద్వారా శిక్షణ ఉంటుందని, కావున ఉపాధ్యాయులంతా తమకు కేటాయించిన సమయంలో శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన శిక్షణా సమయాన్ని తెలుసుకోవటానికి ఇచ్చిన సమయాన్ని ఎక్సెల్ షీట్‌లో స్కూల్ యుడైస్ కోడ్, ఎంప్లాయీ ఐడి ద్వారా తెలుసుకోవాలన్నారు. ఆన్‌లైన్ వెబెక్స్ లింకు కోసం సంబంధిత బైజూస్ నోడల్ ఆఫీసర్లు, ఉప, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా పొందాలని సూచించారు.

వందే భారత్‌కు ఘన స్వాగతం

పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలిలో హాల్టు

పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రైల్వే స్టేషన్లో సికింద్రాబాద్ - తిరుపతి వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు పలువురు ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, మహ్మద్ ముస్తాఫా, డిఆర్ఎం రామకృష్ణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, బిజెపి జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిర్ధేశిత సమయం కన్నా అరగంట ఆలస్యంగా రైలు గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే శాఖపెద్ద ఎత్తున స్వాగత ఏరాట్లు చేసింది. పిడుగు రాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్లలో ఈ రైలు ఆగింది. ఎక్కడికక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం వలికారు. అయోధ్య రామిరెడ్డి

2లో

పిడుగురాళ్లలో స్వాగతం పలుకుతున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయులు

లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

ఈనెల ఆరో తేదీన పెదనందిపాడు మండలం గోగులమూడిలో మతిస్థిమితం లేని యువతి పై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయి కారంపూడి లక్ష్మీ సుబ్బారావు ఉరఫ్ లచ్చం సుబ్బా రావును ఏ బి పాలెం అడ్డరోడ్డు వద్ద పత్తిపాడు సిఐ ఎం వెంకట సుబ్బారావు అరెస్ట్ చేసినట్లు శనివారం విలేకరులకు తెలిపారు. ముద్దాయిని బాపట్ల కోర్టుకు తరలించగా సివిల్ కోర్టు జడ్జి అన్నా మణి ముద్దాయికి 14 రోజులు రిమాండ్ కోసం గుంటూరు సబ్ జైలుకు తరలించారు.

నిబంధనలు బేఖాతర్!

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నా ఎటువంటి చర్యలు లేవు.మరో వైపు అధిక ధరలకు విక్రయించుకునేందుకు తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఇసుక సరఫరా సక్రమంగా లేకపోవడంతో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో పుంజుకోవడం లేదు.

టిడిపి, వైసిపి నేతల మాటల యుద్ధం

ఇసుక అక్రమ తవ్వకాలు, నదిలో రహదారుల నిర్మాణం నేపథ్యంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ మధ్య ఇటీవల మాటల యుద్ధంజరిగింది.ఈ అంశంపై ఆదివారం అమరావతి శివాలయం వద్ద బహిరంగ చర్చకు ఇరువురూ సవాళ్లు విసురుకున్నారు. టిడిపి హయంలో ఎంత తవ్వకాలు జరిగాయి? వైసిపి హయంలో ఎంత తవ్వకాలు జరిగాయో చర్చిద్దామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సవాల్ చేయగా అందుకు సిద్ధం అని కొమ్మాలపాటి అన్నారు. ఇరు వర్గాల వారీని అమరావతి రానివ్వకుండా అడ్డుకునేందుకు పోలీసులు అమరావతిలో 144 విధించారు.

45వ డివిజన్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి -గుంటూరు:గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి - కోటిలింగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. 137వ సచివాలయం పరిధిలోని ముత్యాల రెడ్డి నగర్ మెయిన్ రోడ్డు, తిరుపతమ్మ గుడి వద్ద నుండి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు, డిప్యూటి మేయర్ షేక్ సాజిలా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

మాట్లాడుతున్న సిఐ ఆంజనేయులు

వీరాపురంలో పల్లెనిద్ర

ప్రజాశక్తి -పిడుగురాళ్ల:మండలంలోని వీరాపురంలో శనివారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి జయరాం ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలన్నారు, గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు పేకాట, అక్రమ మద్యం, సంఘ వ్యతిరేక పనులు చేయరాదని, ఆయన గ్రామస్తులకు సూచించారు. చట్టాన్ని ధిక్కరించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రబ్బాని, ట్రాఫిక్ ఎస్ఐ పవన్ కుమార్, వీరాపురం సర్పంచ్ విజయరామారావు, పిడుగురాళ్ల స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో వందేభారత్‌ట్రైన్‌కు స్వాగతం పలికిన ఎంపి శ్రీ కృష్ణదేవరాయలు

తెనాలి

సత్తెనపల్లి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లా డుతూ గొప్పగా అధునాతన టెక్నాలజీతో నూతన రైళ్లను ప్రవేశపెట్టడం ముదావాహం అన్నారు. ప్రజలకు మరిన్ని సౌకర్యా లతో తక్కువ సమయంలో గమ్యం చేరేలా రైళ్లను రూపకల్పన చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. పిడుగురాళ్లలో నర్సరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయులు స్వాగతం పలికారు.

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు పట్టణ ప్రజలు శనివారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో వందేభారత్ ఎక్సప్రెస్ ఆగే విధంగా కేంద్ర రైల్వే మంత్రి, రైల్వే అధికారులతో మాట్లాడటం జరిగిందని ఆయన తెలియజేశారు. అంతే కాకుండా కరోనాకు ముందు ఆగాల్సిన రైలు ఆగటం లేదని, వాటి గురించి కూడా చర్చించారు. ఆవి కూడా ఆగేవిధంగా చూస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ ఛైర్మన్ కొమ్ము ముక్కంటి, పట్టణ, మండల కన్వినర్ చింతా వెంకట సుబ్బారావు, చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్:వందేభారత్ ఎక్స్ ప్రెస్‌కు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్ ప్రెస్‌కు స్థానిక ప్రజలు, పుర ప్రముకులు, విద్యార్థులు స్వాగతం పలికారు. సికింద్రాబాద్ నుండి తిరుపతి వెళ్ళే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు విద్యార్థులు ప్రజలు జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో కొద్ది సేపు వందేభారత్ ఆగింది. వందేభారత్‌కు స్వాగతం పలికేందుకు విద్యార్థులు ప్రజలు అధిక సంఖ్యలో సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

తెనాలిరూరల్:హైదరాబాద్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించిన వందే భారత్ రైలు బండి శనివారం సాయంత్రం 4.50 నిమిషాలకు తెనాలి చేరుకుంది. విజయవాడ ఎడిఆర్‌ఎం ఎం. శ్రీకాంత్ వందే భారత్‌కు ఘన స్వాగతం పలికారు. రైల్వే అధికారి జి ఉదయ్ భాస్కర్‌తో కలసి రైల్లో సదుపాయాలను పైలట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం 4.55 గంటలకు తిరుగు ప్రయాణమయ్యింది. తొలుత స్టేషన్ సూపరింటెండెంట్ టి.వెంకటరమణ చిన్నారులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎడిఆర్‌ఎం మాట్లాడుతూ దేశంలోనే వేగవంతమైన వందే భారత్ రైలు తెనాలికి రావడం సంతోషకరమన్నారు. కేవలం 52 సెకండ్లలో 100 కేఎంపిహెచ్ స్పీడ్ అందుకోవడం వందే భారత్ ప్రత్యేకతన్నారు. తెనాలి గూడూరు స్టేషన్ల మధ్య కేవలం 130 కిలోమీటర్ల వేగంతోనే ఈ ట్రైన్ నడుస్తుందని వెల్లడించారు. 661 కిలోమీటర్ల గమ్యస్థానాన్ని కేవలం 8.30 గంటల వ్యవధిలోనే చేరుకుంటుందని తెలిపారు. వేగంగా ప్రయాణించే రైళ్లపై ఆకతాయిలు రాళ్లు రువ్వుతున్నారని అట్టి చర్యలకు పాల్పడటం చట్టరిత్యా నేరమని అన్నారు. నేరానికి పాల్పడిన వారికి రైల్వే చట్టం ప్రకారం ఐదేళ్ల జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. మరెన్నో వందే భారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం పలు ప్రాంతాల్లో అందుబాటులోకి తేనుందన్నారు. తెనాలి జంక్షన్ కారణంగా అనేక ప్రాంతాలకు చేరుకునే ప్రయాణికులు తెనాలిలో రైలు మారాల్సి ఉన్నందున వందే భారత్ ట్రైన్ కు తెనాలిలో పర్మినెంట్ హల్ట్ కల్పించాలని పలు సేవా, సీనియర్ సిటీజన్, విద్యార్థి సంఘాలు ఎడిఆర్‌ఎం కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, గుంటూరు అడిషనల్ క్రైమ్ ఎస్పి ఎ శ్రీనివాసరావు, తెనాలి డిఎస్పి కె శ్రవంతి రాయ్, రైల్వే, జిఆర్పీ పోలీసులు పాల్గున్నారు.

మామిళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పర్యటన

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

మండలంలోని మామిళ్ళపల్లి లో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల కాలంలో వివాహం చేసుకున్న నూతన వధూవరులైన సుధా, సురేంద్రబాబు ఆశీర్వదించారు. గ్రామ టిడిపి సీనియర్ నాయకులు సిరిగిరి అంకమ్మరావు అల్లుడు బడే శివ నిర్వహించుకుంటున్న వెంకటేశ్వర స్వామి జోగి మహోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మిరియాల వెంకటస్వామి కంటి ఆపరేషన్ చేయించుకున్న సుదా కాళిదాసులను పరామర్శించారు. తదుపరి ఇటీవల కాలంలోమృతి చెందిన సుదా వెంకటనర్స్ కుటుంబ సభ్యులను పరామర్శించారు? ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు , మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ చెలమశెట్టి సీతారామయ్య , పొన్నూరు మండల తెలుగు యువత అధ్యక్షులు మొవ్వ వెంకటకృష్ణ, పొన్నూరు మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులు పటాన్ భాషా, కసుకర్రు గ్రామ బూత్ కన్వీనర్ శ్రీనువాస రావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర

నేడు 'రెండు ఆకాశాల మధ్య' నవలా పరిచయం

- శారదా సాహితీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహణ
- విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి సలీం రచనల్లో మరో ఆణిముత్యం

ప్రజాశక్తి-తెనాలి

విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సయ్యద్ సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' నవలా పరిచయ సభ ఈనెల 9న జరుగనుంది. పట్టణానికి చెందిన శారదా సాహితీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు స్థానిక కొత్తపేటలోని అతిథి గ్రాండ్ వేదికగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, యర్రంశెట్టి హనుమంతరావు శనివారం వెల్లడించారు. పుస్తక రచయిత, తదితర వివరాలిలా ఉన్నాయి.

రచయిత సయ్యద్ సలీం

ప్రముఖ నవలా రచయిత సయ్యద్ సలీం ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా కొంతకాలం పనిచేశారు. తదుపరి ఐఆర్‌ఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని త్రోవగుంట ఆయన స్వగ్రామం. పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడిన ఆయనకు కళాశాల దశలోనే కథలు, కవితలు రాయటం అలవాటు. సాహిత్యంపై ఆయనకున్న మక్కువతో ఇప్పటి వరకూ 250కి పైగా కథలు రాశారు. 1980లో ఆయన రచించిన తొలికథ 'మనీషి' ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమైంది. 'రాణిగారి కథలు' పేరుతో చేసిన రచన 56 ఎపిసోడ్లుగా టివిలో ప్రసారమైంది. రాణి గారి కథలు దారావాహికకు ఉత్తమ టీవి ఫిల్మ్ సిరీస్ కింద సలీం నంది బహుమతి కూడా అందుకున్నారు. సలీం రచించిన 'కాలుతున్న పూలతోట' నవలకు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. 1999లో ఆయన చేసిన రచన 'నీలోకి చూసిన జ్ఞాపకం', 2005లో రాసిన 'ఆకులు రాలే దృశ్యం', 2013లో రచించిన 'విషాద వర్ణం' కవితా సంపుటాలు ప్రచుయరితమయ్యాయి. ఇప్పటి వరకూ సలీం 27 నవలలు రచించారు. వీటిలో 'వెండి మేఘం' నవలకు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. సయ్యద్ సలీం రచనల్లో 52 రచనలను ఇంగ్లీష్, కన్నడ, మళయాళం, తమిళం, హిందీ, ఒరియా, మరాఠి భాషల్లోకి అనువదించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంకు చెందిన పలువురు పరిశోధకులు సలీం రచనలపై ఎంఫిల్, పిహెచ్‌డి చేశారు. సలీం ఇప్పటి వరకూ సాహితీ రంగానికి అందించిన సేవలకుగాను దాదాపు 20కి పైగా పురస్కారాలందుకున్నారు. తెనాలిలో నిర్వహించే సలీం నవలా పరిచయ సభలో ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్‌హకీంజాని, రచయిత నూతనలపాటి నాగేశ్వరరావు పొల్గొననున్నారు. వారితో పాటు సభకు సాహితీ ప్రియులు పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.



రెండు ఆకాశాల మధ్య నవల కవర్ పేజి

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

కోడిపందాలు స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన సత్తెనపల్లి మండలం గోగులపాడు రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. కోడి పందాలు వేస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ సిబ్బందితో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్ళను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరు పరిచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నరసరావుపేట

పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఒకగృహ సముదాయంలో పేకాట ఆడుతున్నా రన్న సమాచారం మేర దాడి పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి రూ. 40620ల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డుపై ఇరువర్గాలు బాహాబాహీ..

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి దేవస్థానం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరాడో బ్యాంకు ఎదురుగా ఉన్న ఓ ఆసుపత్రి వద్ద ఇరువర్గాలు శనివారం రాత్రి బాహాబాహీకి దిగారు. ఓ రోడ్డు ప్రమాదంలో ఆసుపత్రికి ఇరువర్గాలు చేరుకున్నారు. ముందు వెళుతున్న వాహనాన్ని వెనుక నుండి మరో వాహనం ఢీ కోట్టింది. వెనుక ఉన్న వాహనం పోలీస్ కానిస్టేబుల్‌కు చెందినదిగా తెలుస్తుంది.. అనంతరం ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ క్రమంలో ముందు ఉన్న వాహన దారులతో వాగ్వాదానికి దిగిన కానిస్టేబుల్ అతనిపై దాడి చేసి,మొబైల్ ఫోన్ లాక్కున్నాడు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం ఇరు వర్గాలను స్టేషన్‌కు తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - తెనాలి

అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం సీజ్ చేశారు. ఎస్ఈబి సిఐ చలం వెల్లడించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక ప్రాంతం నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అనధికారికంగా తరలిస్తున్న నేపథ్యంలో ఎస్ఈబి అధికారులు పట్టుకొని ట్రాక్టర్లను సీజ్ చేసి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. అధిక లోడుతో వెళ్తున్న మరో లారీని గుర్తించి రూ.10వేలు అపరాధ రుసుం విదించినట్లు తెలిపారు.

మెయిన్ రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలు

ఇసుక లారీలతో భయం.. భయం

ప్రజాశక్తి-అమరావతి

పట్టణంలో అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలతో పెను ప్రమాదం పొంచి ఉందని ఏ క్షణం ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసి బస్టాండ్‌సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఇరు వైపులా అతి వేగంగా ప్రతి రోజు భారీ ఇసుక లారీలు తిరుతున్నాయని, వేగ నియంత్రణ లేకుంటే అంబేద్కర్ విగ్రహాన్ని సైతం ఢీ కొట్టే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. సుమారు గంటకు 30కు పైగా ఇసుక లారీ లు తిరుగుతుంటాయని, అధిక లోడు , అధిక వేగంతో తిరిగే లారీలను నియంత్రించాల్సిన అధికారులు సైతం నిమ్మకుండి పోతున్నారని పలు వ్యాపారాలు చేసుకునే వ్యాపారులు, రోడ్డుపై నడిచే పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని అధిక లోడుతో తిరిగే వాహనాలను నియంత్రించాలని కోరారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మాచర్ల

వృద్ధురాలు గడ్డం రత్తమ్మ(65) అనుమానస్పద స్దితిలో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం స్థానిక నెహ్రూనగర్‌లోని 2వ లైనులో నివాసం ఉంటున్న ఇంటిలో ఒక గదిలో రత్తమ్మ ఉంటుండగా, ప్రక్కనే పెద్ద కుమారుడు నివాసం ఉంటున్నాడు. రత్తమ్మ తెల్లవారుజామున గది ముందు ఉన్న గ్రిల్స్‌కు ఊరి వేసుకోని చనిపోయి ఉంది. రెండో కోడుకు గడ్డం మల్లికార్జునరావు సమీపంలోనే ఉంటున్నాడు. తల్లి మరణ వార్త విని వచ్చి తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేయటంతో పట్టణ పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రత్తమ్మ మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

LAKSHMI NARASIMHA COLLEGE OF EDCATION

(Recognised by NCTE, Govt of A.P & Affiliated to ANU

OLD POLICE STATION, VARAKATTA, Narasaraopet Mandal, Guntur Dist.(A.P)-522601

Ph. No. Cell:08647-223306, 9866804185

NOTIFICATION FOR - CAT 'B' & SPOT ADMISSIONS

EDCET Code:LNNP

Application are invited from eligible candidates for the academic year 2022-24 under Management seats Category B & SPOT admission seats into B.ED Course. Application forms can collect from College Office.

Last date of Submission of application is **10-04-2023**

Narasaraopet **PRINCIPAL**

07-04-2023

PUJITHA COLLEGE OF EDCATION

(Recognised by NCTE, Govt of A.P & Affiliated to ANU

Door No.6-42, RAVIPADU-522601, Narasaraopet Mandal, Guntur Dist.(A.P)

Ph. No. Cell:9866575360, 9642531948

NOTIFICATION FOR - CAT 'B' & SPOT ADMISSIONS

EDCET Code:PCNG

Application are invited from eligible candidates for the academic year 2022-24 under Management seats Category B & SPOT admission seats into B.ED Course. Application forms can collect from College Office.

Last date of Submission of application is **10-04-2023**

Narasaraopet **PRINCIPAL**

07-04-2023

PALNADU COLLEGE OF EDCATION

(Recognised by NCTE, Govt of A.P & Affiliated to ANU

NARAYANAPURAM, NADIKUDI, DACHEPALLI Mandal, Guntur Dist.(A.P)-522414

Ph. No. Cell:9849582377

NOTIFICATION FOR - CAT 'B' & SPOT ADMISSIONS

EDCET Code:PLND

Application are invited from eligible candidates for the academic year 2022-24 under Management seats Category B & SPOT admission seats into B.ED Course. Application forms can collect from College Office.

Last date of Submission of application is **10-04-2023**

Dachepalli **PRINCIPAL**

07-04-2023

AM REDDY COLLEGE OF EDCATION

(Recognised by NCTE, Govt of A.P & Affiliated to ANU

ATLURI MASTAN REDDY NAGAR, PETLURIVARIPALEM 522601, Narasaraopet Mandal, Guntur Dist.(A.P)

Ph. No. Cell:9642531948, 9052313222

NOTIFICATION FOR - CAT 'B' & SPOT ADMISSIONS

EDCET Code:AMRN

Application are invited from eligible candidates for the academic year 2022-24 under Management seats Category B & SPOT admission seats into B.ED Course. Application forms can collect from College Office.

Last date of Submission of application is **10-04-2023**

Narasaraopet **PRINCIPAL**

07-04-2023

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - తెనాలి: భర్త తనపై దాడి చేసాడంటూ మహిళ చేసిన ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన పట్టణంలోని చినరావూరులో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజేశ్వరి, పుట్టి పుల్లారావు భార్య భర్తలు. వారి మధ్య తరచుగా వాగ్వవాదాలు జరుగుతున్న నేపద్యంలో రాజేశ్వరిపై పుల్లారావు దాడి చేశాడు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET.

Creditors insolvency petition NO. 24/23.

Between:-

Kasu Ranga Reddy ... Petitioner.

AND

1) Nalam Lakshman Rao ...Debitor.

2) Gundala Suresh Babu.

3) kota Bhagyalakshmi ...Respondents.

పై నెంబర్ I.P దావాలో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్స్ పై Creditor IP దాఖలు చేసి సదరు పిటిషనర్ తనకు రావలసిన బాకీ ని 1 వ ప్రతివాది నుండి రాబట్టుటకు దాఖలు చేసి ఉన్నారు. సదరు I.P లో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట ది. 27-04-2023 న ఉదయం 10:30ని.లకు మీరు స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరుచుకోగలరు. ఈ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో వాయిదా 27-04-2023.

ఇట్లు.

కె.బుచ్చిదంతా చారి, అడ్వకేట్

నరసరావుపేట.

IN THE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA

E.P.No 62/2022

in

O.S.No 926/2008

Between:- M/S Shriram Chits (P) Ltd.
Vinnakota Vari Street Branch Vijayawada ...DHR

And

G.Srinivasa Rao & Others

JDR No:4 G.Devid Vijaya Kumar S/o Prasad Rao Age 40 Years, Head Master, M.P.P School, Madipadu Village, Achampeta Mandal, Guntur Dist.

పై నెంబరు EP ని DHR Company వారు పై Decree బాకీని ఖర్చులతో రాబట్టు కొనుటకు V/o 21 R22 R48 C.P.C ప్రకారం దాఖలు చేయగా అందుపై EP లో 4వ J.D.R కు V/or 21 R22 C.P.C ప్రకారం నోటీసుల నిమిత్తం ది.17-04-2023 నకు శ్రీ కోర్టు వారు వాయిదాగా వేసి యున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10-30ని॥లకు 4వ J.D.R స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది:17-04-2023

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము) చిత్తగించవలెను

V.Ravi Shankar,
Advocate For D.H.R
Vijayawada.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రొంపిచర్ల

గుర్తుతెలియన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని సంతగుడిపాడు గ్రామ శివారులోగల, అద్దంకి - నార్కెట్ పల్లి స్టేట్ హైవే మీద చోటు చేసుకుంది. సుమారు 35 -40 ఏళ్ల వయసు కలిగి ఉందని ఎవరైనా ఈ మహిళను గుర్తించినట్లయితే స్థానిక పోలీస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సిహెచ్ రమేష్ తెలిపారు.

మహారాజశ్రీచీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS.NO.53/2010

Between:

ఎలికా ధనలక్ష్మీ వగైరా ..... వాదులు

VS

కోటి వెంకయ్య (died) Et ..... ప్రతివాదులు

To

D3) కోటి శేషమ్మ w/o లేట్ వెంకయ్య
D.No.94-10-709, 10/1, లైన్, A.T. అగ్రహారం, గుంటురు.

D4) కోటి విజయలక్ష్మి D/O లేట్ వెంకయ్య,
D.no.94-10-709, 10/1 లైన్, A.T. అగ్రహారం, గుంటూరు.

D5) కోటి మౌనిక D/O లేట్ వెంకయ్య ,
D. NO.94-10-709, 10/1, లైన్, AT. అగ్రహారం గుంటూరు.

పై నంబరు దావాను వాదులు పర్మనెంటు ఇంజంక్షన్ వగైరా పరిహారనిమిత్తం దాఖలు చేయగా మీరు 1వ ప్రతివాది అయిన కోటి వెంకయ్య వారసులుగా ధావాలో 3 నుండి5వ ప్రతివాదులుగా చేర్చబడి, కోర్టు వారు మీకు దావా సమన్లు జారీ చేయగామీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పత్రికా ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు జారీ చేసియున్నారు. కాబట్టి ది: 03-05-2023వ తేదీన ఉదయం 10.30ని.కు మీరు స్వయం గాని న్యాయవాది ద్వారా కానీ పైకోర్టులో హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షంలో దావాను విచారించబడునని మీకు తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు

బండారుపల్లి హేమంత కుమార్
అడ్వకేట్ & నోటరీ (భారత ప్రభుత్వం)
చర్చి కాంపౌండ్, చీరాల, బాపట్ల జిల్లా

ఏళ్లు గడుస్తున్నా.. మురుగనీళ్లు పోవట్లేదు!

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోళ్ళపాడులోని కెజిబివి పాఠశాల గేటు వద్ద మురుగునీరు దాదాపు రెండేళ్లుగా నిలిచిపోయింది. దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. పక్కనే ఉన్న ఎస్టీ కాలనీ నుంచి వచ్చే నీరు, చెత్తాచెదారం, పంట పొలాల నీరు ఇక్కడికి చేరి నిలిచిపోతోంది. ఆ మురుగునీరు ఎటు వెళ్ళే మార్గం లేక అక్కడే నిలిచి పోవడంతో దుర్వాసన వెద జల్లు తోంది. అంతేకాకుండా, పాఠశాల ఎదురుగా ఉన్న చెరువులో చేపలు పడుతుండడం, చనిపోయిన వాటిని చెరువు గట్టుపైనే పడేస్తుండటం కొన్ని రోజులుగా జరుగుతోంది. కుళ్ళిపోయిన చేపల దుర్వాసన ఎస్టీ కాలనీ వరకు వస్తుండడంతో భరించ లేకపోతున్నామని అక్కడ నివసించే వారు చెబుతున్నారు. ఆయా సమస్యలపై పంచాయతి అధికారులు స్పందించి కెజిబివి పాఠశాల గేటు వద్ద ఉన్న మురుగును తొలగించాలని, చేపల చెరువు వద్ద దుర్వాసన వెదజల్లకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గురుకుల బాలుర పాఠశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రెంటచింతల

మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసించుటకు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ హెూహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40, 6వ తరగతిలో 3, 9వ తరగతిలో 10 ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎస్.టి విద్యార్ధులకు 78 శాతం, ఎస్.సి విద్యార్ధులకు 12 శాతం, బి.సి విద్యార్ధులకు 5 శాతం, ఓ.సి విద్యార్ధులకు 2 శాతం, పిహెచ్‌సి 3 శాతం సీట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 29వ తేదీన ఉదయం 10.00 గంటలకు గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. వివరాల కోసం 9951640484 సెల్ నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

పది పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రం రెంటచింతలలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ వెంకటేశ్వరరావు తెలిపారు. 682 విద్యార్థులకు గాను 676 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ డిగ్రీ కాలేజీలో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాగులూరి హరిబాబు ప్రారంభించారు. కాటూరి మెడికల్ హాస్పిటల్ సహకారం అందించగా,ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరానికి 586 మంది వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, కిరణ్, ప్రసాద్, సిద్దయ్య, సుబ్బారావు, రామారావు, వెంకట్రామిరెడ్డి, ఏపూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెలకు త్వరలో అనుమతులు

ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-వినుకొండ

పల్నాడు ప్రజల జీవనాధారమైన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం త్వరలో జరుగుతుందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వరికపూడిసెల జలసాధన కమిటీ అధ్యక్షులు దామెర రమణరావు కుమారుడు సుబ్బారావు ప్రథమ వర్ధంతి శనివారం జరిగింది. ఈ సందర్భంగా బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెం గ్రామానికి ఎంపి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు వెళ్లారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వర్ధంతి కార్యక్రమానికి విచ్చేసిన మాచర్ల వెల్దుర్తి దుర్గి పుల్లలచెరువు తదితర ప్రాంతాల వరికపూడిసెల జలసాధన కమిటీ సభ్యులతో ఎంపి మాట్లాడారు. తప్పనిసరిగా వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం అవుతుందని, అందుకు అవసరమైన అటవీ అనుమతులు వస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని అటవీ అనుమతులు రాగానే పనులు ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో ఎంపి శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న ముప్పాళ్ల ఎస్ఐ పట్టాభి రామయ్య

ప్రీమియర్ లీగ్-15 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రంజాన్ పండుగను పురస్కరించుకుని గ్రామ స్థాయి ప్రీమియర్ లీగ్ -15 క్రికెట్ మ్యాచ్‌లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ముప్పాళ్ల గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ క్రికెట్ మ్యాచ్‌లను ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల ఎస్ఐ పట్టాభి రామయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీరక ధృఢత్వానికి దోహదపడుతాయని, స్నేహ భావం పెంపొందుతుందని అన్నారు. ఈ క్రికెట్ లీగ్ మ్యాచ్ లు రంజాన్ పండుగ రోజు వరకూ జరుగుతాయని, పండుగ రోజు ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని చెప్పారు. ముప్పాళ్ల గ్రామం నుంచి నాలుగు జట్లు పాల్గొంటున్నట్లు కమిటి సభ్యులు సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.10,116,రెండవ బహు మతి రూ. 5,116, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరిస్ బహుమతులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొప్పరం జిలాని, మాభు సుభాని, సయ్యద్ అన్వర్, లీలాఫర్, సమీ, రఫీ, మౌలాలి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యకు దీటుగా డిగ్రీలో ప్రత్యేక తరగతులు

- **దిగ్గజ ఐటి కంపెనీ టిసిఎస్‌తో విద్యార్థులకు శిక్షణ**
- **వాగ్దేవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శనివారం ఐటి రంగంలో దిగ్గజ కంపెనీ టిసిఎస్‌తో ఒప్పందం చేసుకున్నట్లు, దీని ద్వారా తమ కళాశాలలో డిగ్రీ చివరి సం వత్సరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వంరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ద్వారా కార్పొరేట్ కంపెనీలు విద్యార్థుల నుండి ఎటు వంటి నైపుణ్యాలు కోరు కుంటున్నా యో వాటిని ఇక్కడ ఇచ్చే శిక్షణలో నేర్పడం వలన విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ తరగతులు నెల రోజుల పాటు జరుగుతాయని, టిసి ఎస్ ద్వారా పల్నాడు జిల్లాలో గుర్తిం పు పొందిన మొట్టమొదటి, ఏకైక విద్యా సంస్థ తమ కళాశాల అని పేర్కొన్నారు. కేరళకు చెందిన ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ అజిత్ కుమార్ వర్మ ఈ శిక్షణ అందిస్తున్నా రని తెలిపారు. తమ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థికీ ఉద్యోగ , ఉపాధి సాధన లక్ష్యంగా, ఇంజనీరింగ్ విద్యకు దీటుగా డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్లు,అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరంబాడి సుందరాచారికి నివాళి

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో శంకరంబాడి సుందరాచారి 46వ వర్ధంతి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లా డుతూ శంకరంబాడి సుంద రాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతం తెలుగు వారి ఉనికిని చాటిచెప్పిందని అన్నారు. తెలుగు వారి వైభవాన్ని వర్ణించిన ఈ గీతం 1975లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించిదని, 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతంగా ఉందని అన్నారు. 'మా తెలుగు తల్లికి' తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పటికి సుందరగీతంగా మిగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎన్.శ్రీనివాసరావు, జి.లూర్ధు మర్రెడ్డి, వై. వెంకట సైదయ్య, జి.కిరీటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని పల్నాడు హాస్పిటల్స్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జర్నలిస్టులకు హెల్త్ కార్డ్స్ ను పంపిణీ చేయనున్నట్లు ప్రముఖ కీళ్ళ మార్పిడి వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ హాస్పిటల్స్ వార్షికోత్సవం సందర్భంగా గత ఏడాది మాదిరిగానే గురజాల నియోజకవర్గంలోని ప్రతీ జర్నలిస్ట్‌కు హెల్త్ కార్డ్స్ రెన్యువల్‌తో పాటు ఇన్సూరెన్స్ చేయించనున్నట్లు పేర్కొన్నారు. చింతలపూడి ఛారి టబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వారి వివరాలను పిడుగురాళ్ల లోని పల్నాడు హాస్పిటల్స్ లో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-మాచర్ల

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని డాక్టరు గోలి ద్రాక్షాయిని ప్రశంసించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో శనివారం పేద మహిళలకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిది ద్రాక్షాయిని మాట్లాడుతూ నిరుపేద మహిళలకు సీమం కార్యక్రమం ఏర్పాటు చేసి వారి లో ఆనందం నింపడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమానికి ఆర్థికంగా తోడ్పాటు అందించిన గోలి శ్రీనివాసరావును వాసవీ క్లబ్ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస రావు, దుర్గా, అల్లం కోటిరెడ్డి, అర్జునరావు, చుండూరు సత్యనారాయణ, మేడా వెంకటలక్ష్మి, గిరజా, మారం రుక్మిణి, కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

శాంతి ఆశ్రమ ట్రస్ట్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షులు చెరుకూరి వెంకటరావు పుట్టినరోజు సం దర్భంగా శనివారం నాడు పట్టణంలో సేవా కార్య క్రమాలు, శ్రీ వెంకటేశ్వర స్వామి. రామా లయం దేవాలయాల్లో పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక అన్నా క్యాంటీన్ వద్ద అన్న దాన కార్యక్రమం, పరివర్తన విద్యార్థులకు అల్పాహారంఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు 29వ వార్డులో ముస్లింలకు పట్టణ టిడిపి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వెంకట్రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టిడిపి రాష్ట్ర నాయకులు వెన్న సాంబశివరెడ్డి, నాయకులు మనెన్యం శివ మల్లేశ్వరరావు (అబ్బూరు మల్లి), డాక్టర్ పవన్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి, మండల పార్టీ నాయకులు ఎ.అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, కోమటినేని శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సయ్యద్ పెద్ద కరీ ముల్లా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి బాబు తదితరులు ఉన్నారు.

కొండవీటి వాగును కప్పేసిన తూటుకాడ,గుర్రపుడెక్క

- నాలుగేళ్లుగా వాగులో తొలగించని పరిస్థితి
- తొలగించకుంటే పొలాలకు ముంపు ముప్పు
- నీటి పారుదల లేక దుర్వాసన

ప్రజాశక్తి-తాడేపల్లి

పల్లె పడుచుకు పచ్చని చీర కట్టినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం పచ్చని పంట పొలం అనుకుంటే తప్పులో కాలేసినట్లు. రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి గృహల వద్ద గుర్రపుడెక్క, తూటుకాడ పెనవేసుకుని మధ్యలో పిచ్చి చెట్లను కూడా తనలో కలుపుకుని కనిపిస్తున్న ఈ పచ్చదనం కింద కొండవీటి వాగు ఉంది. మంగళగిరి నియోజక వర్గంలో రైతుల దు:ఖదాయనిగా పేరుగాంచిన కొండవీటి వాగుకు మరమ్మతులు లేక ఈ దుస్థితి నెలకొంది.

రైతుల అభివృద్ధి కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెబుతున్న పాలక పార్టీలు కనీసం వాగులో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాగులో నీరు పారుదల లేకపోవడంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతుంది. వర్షాలు వస్తే పంట పొలాలు మునకకు గుర్రపుడెక్క, తూటుకాడ కారణమవుతున్నాయి. పట్టించుకోవాల్సిన పాలకవర్గాలు ఈ వాగు వైపు కన్నెతి చూడటంలేదు. తాడికొండ నియోజకవర్గం లాము దగ్గర ప్రారంభమయ్యే కొండవీటి వాగు మంగళగిరి, తాటికొండ నియోజకవర్గాల్లో సుమారు పది వేల ఎకరాలకు సాగునీరందిస్తుంది. ముఖ్యంగా రాజధాని ప్రాంతమైన పెనుమాక, ఉండవల్లి, కృష్ణాయపాలెం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో భూములు సస్యశ్యామలంగా మారి సంవత్సరానికి మూడు రకాల పంటలు పండుతున్నాయి. ప్రకృతి అనుకూలించక ఒక సంవత్సరం నష్టం వచ్చినా మరో సంవత్సరం పంటలు పండి రైతుల ఇంట ఈ ప్రాంత భూములు సిరులు కురిపిస్తున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం అమరావతి రాజధానిగా 29 గ్రామాలను కలిపి సీడ్ క్యాపిటల్‌గా గత ప్రభుత్వం ప్రకటించింది. అనేక మంది రైతులు రాజధాని నిర్మాణానికి తమ భూములను పూలింగ్‌కు ఇచ్చారు. ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, నిడమర్రు తదితర గ్రామాల్లో మెజార్టీ ప్రజలు తమ భూములు ఇవ్వలేదు. ఇప్పటికీ ఆయా గ్రామాల రైతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వాగులో ఉన్న గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించకపోతే రైతుల పంట పొలాలకుముంపు భయం నెలకొని ఉంది.

ఇది పచ్చని పంట పొలం కాదు - పంట పొలాలకు నీరందించే కొండవీటి వాగు

ముంపు నివారణకు గత ప్రభుత్వం సుమారు రూ. 187 కోట్లతో సీతానగరం వద్ద కృష్ణానదిపై నిర్మించిన కొండవీటి వాగు హెడ్‌స్లూయిస్ వద్ద (కొండవీటి వాగు కృష్ణానదిలో కలిసే ప్రాంతం) ఎత్తిపోతల పథకం పనులు చేపట్టి పూర్తి చేసింది. అధిక వర్షాలు, వరదలు సందర్భంగా వాగులో నీరు అధికంగా వస్తే పంటల పొలాలు మునగకుండా మోటార్ల ద్వారా నీటిని ఎత్తి కృష్ణానదిలోకి డంప్ చేస్తారు. గత సంవత్సరం కృష్ణానదికి పెద్దఎత్తున వరద నీరు వచ్చిన సమయంలో ఎత్తిపోతల పథకం గేట్లు ఎత్తించడానికి రైతులు అధికారులను బతిమలాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పై అధికారులు ఆదేశాలు ఇవ్వకపోతే తాము ఎత్తిపోతల పథకం పని ప్రారంభించలేమని అక్కడ సిబ్బంది రైతులతో చెప్పారు. తమ పంటల పొలాలు మునిగిపోతున్నాయి బాబూ అంటూ రైతులు గగ్గోలు పెడితే ఎట్టకేలకు ఎత్తిపోతల పథకం మోటార్లను సిబ్బంది ఆడించారు. వాగులో పేరుకుతన్న గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించక పోవడంతో వాగులో ఉన్న నీళ్లు వెనక్కి తన్ని రైతుల పంట పొలాలు మునకకు గురవుతున్నాయి. దీంతో రైతులు తమ విలువైన పంటలను నష్టపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా వాగులోని గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించి వాగును శుభ్రంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

కొండవీటి వాగును శుభ్రం చేయండి : సిపిఎం

కొండవీటి వాగులో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ, పిచ్చి చెట్లను తొలగించి పంట పొలాలు ముంపునకు గురి కాకుండా చూడాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి ఒక ప్రకటనలో కోరారు. పాలకుల వైఫల్యం కారణంగా రైతులు ఇబ్బంది పడకూడదని తెలిపారు.

వాగును పరిశీలించిన జనసేన నాయకులు

ఉండవల్లి గుహల వద్ద కొండవీటి వాగులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడను జనసేన నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా వాగులో గుర్రపుడెక్క, తూటుకాడ తీయడం లేదని విమర్శించారు. అమరావతి ముంపునకు గురి కాకుండా ఉండాలంటే వాగులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాల్సిన అవసర ముందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.రామ, డి.శిగనాగేంద్రం, సిహెచ్.శ్రీనివాసరావు, వెంకట్, పి.జగదీష్, మారుతి, శరత్‌నాయుడు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మేయర్ ఈస్టర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజలకు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఏప్రిల్ 9న తారీఖు ఈస్టర్ పండుగని క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రజలందరూ క్రీస్తు చెప్పిన అహింసా మార్గంలో పయనిస్తూ, సాటి వారిని ప్రేమిస్తూ, ఆయన ఉపదేశానుసారం పయనించాలని తెలియచేశారు.

ఘనంగా కెవికె కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-గంటూరు

స్థానిక అరండల్‌పేట మూడోలైనులో డాక్టర్ కొలిచలా వెంకట కష్ణమూర్తి సంస్కృత కళాశాలలో 1970, 80 దశకాలలో విద్యా ప్రవీణ, భాషా ప్రవీణ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమై సందడి చేశారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, గత స్మతులు నెమరు వేసుకున్నారు. ముఖ్యఅతిథిగా అష్టావధాని, బ్రహ్మశ్రీ ఆచార్య బేతవోలు రామబ్రహ్మం హాజరయ్యారు. రామబ్రహ్మం దంపతులతో పాటు, పూర్వప్రాచార్యులు డాక్టర్ దిగంబర సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ ఆకెళ్ళ మల్లు సోమయాజులు, డాక్టర్ భువనగిరి శ్రీనివాస వరప్రసాద్, డాక్టర్ ఆంజనేయశాస్త్రి, పుల్లాభట్ల వెంకటేశ్వర్లు తదితరులను

రామబ్రహ్మం దంపతుల్ని సన్మానిస్తు పూర్వ విద్యార్థులు

శాలువాలు పూలదండలు సన్మాన పత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కెవిఎస్‌వి ప్రసాదశర్మ, నడింపల్లి విజయప్రసాద్, డివిఎన్ ధన్, డాక్టర్ పి.కోటిరత్నం, పసల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి మంగళగిరి

ప్రతీ సంవత్సరం గుడ్ ఫ్రైడే అనంతరం వచ్చే పవిత్ర శనివారం రోజు నిర్వహించే ‘ రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ’ మంగళగిరిలో ఉత్సాహ వాతావరణంలో నిర్వహించారు. నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి శాంతి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ. తిమోతి అధ్యక్షత నిర్వహించారు. ఆనంద జ్యోతి సంస్థ రెక్టార్ ఫాదర్ జయరాజ్, ఫాదర్ పూదోట చిన్నయ్య, శాంతి దూత మినిస్ట్రీస్ డైరెక్టర్ కె రూఫస్, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి ప్రసంగించారు. భారత దేశం లోని సెక్యులర్ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం అన్నారు. గుడ్ ఫ్రైడే సాక్షిగా మనం శాంతికి పునరంకితం కావాలని కోరారు.ర్యాలీలో మత ప్రమేయం లేని లౌకిక రాజ్యం వర్ధిల్లాలి.. ప్రపంచశాంతి వర్ధిల్లాలి అని నినదించారు. వివిధ రంగాల ప్రముఖులు ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ర్యాలీ అంబేద్కర్ సెంటర్‌నుండి గౌతమబుద్ధ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ సెంటర్, టిడ్కో గృహ సముదాయాల మీదుగా, దిగుడుబావి

సెంటర్ నుండి పాతమంగళగిరి , మిద్దె సెంటర్, రాజీవ్ సెంటర్, ఎంపిపి కార్యాలయం ప్రాంగణం ఇందిరా కళావేదిక వద్ద కార్యక్రమాన్ని ముగించారు.

ముందస్తు పన్ను రూ.1 కోటి వసూలు

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజలు ఆస్థి పన్ను ముందస్తు చెల్లింపులపై రాయితీని వినియోగించుకుంటూ శనివారం ఒక్కరోజే రూ. 1కోటి చెల్లింపులు చేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏకమొత్తంలో ఆస్తి, ఖాళీ స్థలం పన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నార న్నారు. ఆదివారం సెలవురోజు అయినా క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని, ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. డిమాండ్ నోటీసుల కోసం వేచి చూడకుండా అస్మెంట్ నంబర్‌తో నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించి, పన్ను చెల్లించి రాయితీ పొందవచ్చన్నారు.

సరుకులు అందజేస్తున్న మేయర్

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రాబిన్‌హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు.శనివారం ముత్యాలరెడ్డి నగర్‌లోని 1వ లైన్‌లో రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ ప్రతినిధులు సదరు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాబిన్‌హుడ్ ఆర్మీ సేవాసంస్థ జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు.ముఖ్యంగా వద్ధాశ్రమాలకు, అనాధాశ్రమాలకు ఎక్కువగా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, వారిని ఆదుకున్నారని తెలియచేశారు. అంతేకాక కరోనా సమయంలోనూ ఎంతో మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి పేదలకు అండగా నిలుస్తున్నారని, మున్ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిచాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో రాబిన్‌హుడ్ ఆర్మీ సేవాసంస్థ ప్రతినిధులు భవనం హారిక, ఝాన్సీ లక్ష్మీ వారి కుటుంబ సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెనుమాకలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుమాక గ్రామంలో చైతన్య అంబేద్కర్ యువత 24 యూనిట్లు రక్తదాన నిధిని సేకరించింది. ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాట్లు చేసినట్లు ఐశ్వర్య ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.రక్తదానంచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన అంబ్కేదర్ యూత్ సభ్యులను స్థానికులు అభినందించారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-వినుకొండ

బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామా నికి చెందిన రాత్లావత్ మూర్తి బాయికి సీఎం సహాయ నిధి కింద రూ.1.10 లక్షల చెక్కును నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం అందజేశారు. ఆరు నెలల క్రితం మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకున్న మూర్తిబాయి, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సిఎం సహాయ నిధి కోసం ప్రయత్నించింది.అయితే, గ్రామానికి చెందిన కొం దరు నాయకులు ఆర్థిక సహాయం అందనివ్వ కుండా అడ్డు కోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎంపిని కలిసి ఈ విషయమై ఆయనకు విన్న వించుకున్నారు. స్పందించిన ఎంపి, ఆమెతో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేయిం చారు. ఈ క్రమంలో లబ్ధిదారురాలు మూర్తి బాయికు ఈ చెక్కును అందజేశారు. బొల్లాపల్లి మండలం అయ్యన్న పాలెంలో ఓ కార్యక్రమా నికి హాజరైన ఎంపి, ఈ చెక్కును ఆమెకు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధు లతో బాధపడు తున్న వారికి ప్రభుత్వం సిఎం సహాయ నిధి నుండి ఆదు కుంటుందని చెప్పా రు. ఈ సందర్భంగా 'ఫ్యామిలి డాక్టర్' గురించి ఆయన ప్రస్తా వించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తుమ్మ వెంకటేశ్వర్ రెడ్డి, కోటా నాయక్ పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వితరణ

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక పాముల కాలనీలో అంగన్వాడి కేంద్రాన్ని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం శనివారం సందర్శిం చింది. అంగన్వాడి కేంద్రంలో అవసరమైన ఫ్యాన్, రైస్ కుక్కర్‌తో పాటు చిన్నారులకు స్వీట్స్ అందజేశారు.ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా తమ సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. సంఘ సభ్యుల సహకారంతో ఇకముందు కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. చిన్నారులు చక్కగా చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు సుబ్బయ్య శర్మ, నాగేంద్రుడు, రామలింగేశ్వరరావు, సుందర రావు, జోజయ్య,అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'గిరిజన శంఖారావం' ఏర్పాట్లపై చర్చ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోగురజాల నియోజకవర్గంలోని ఎస్టి నాయకులతో శనివారం సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే యం పతినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ నెల 20న మాచవరంలో జరగనున్న గిరిజన శంఖారావం కార్యక్రమం ఏర్పాట్లపై ఎస్టి నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి ధారూ నాయక్, పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కోట నాయక్, రంగా నాయక్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి భూక్య బాలాజీ నాయక్, పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు భోజావత్ నరసింహా నాయక్, గురజాల నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు కండెల అంజి, పిడుగురాళ్ళ పట్టణ పార్టీ అధ్యక్షులు పాండురంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణి

ప్రజాశక్తి-దాచేపల్లి

గురజాల నియోజకవర్గంలో పిడుగురాళ్ల దాచేపల్లి మాచవరం గురజాల మండలాల్లో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఇన్విజిలేటర్లకు మజ్జిగ ప్యాకెట్లను చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతలపూడి శ్రీని వాసరావు, పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'హలో నేస్తం' కార్యక్రమంలో భాగంగా పంట నష్టపోయిన రైతులకు నాలు గు మండలాల్లో ఒక్కొక్క రైతుకు రూ.6000 చొప్పున తమ ట్రస్ట్ ద్వారా అందించామని, 'మా ఆడబిడ్డ మన బాధ్యత' ద్వారా నియోజకవర్గంలో పెళ్లి చేసుకుంటున్న నూతన వధు వుకు పట్టుచీర,తాళిబొట్టు, సారె అందించామని, చదువు కోలేని పేద విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడు తూ వేసవి దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు రాసి అలసి పోయి ఉంటారని , వారు బయటకు రాగానే ఉపశమనం కోసం మజ్జిగ ప్యాకె ట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. పది పరీక్షలు జరిగినన్ని రోజులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని అన్నారు.

'ప్రజల అనుమతితోనే ప్రతీ ఇంటికి స్టిక్కర్'

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పొందిన లబ్దిని ప్రజలకు వివ రించడమే 'జగనన్నే మా భవిష్యత్' కార్య క్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్య క్రమంలో భాగంగా శనివారం స్థానిక 31వ వార్డు లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అం దించే పథకాలు అందుతు న్నాయా లేదా అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నా మన్నారు. జగన్ పాలనపై ప్రజల అబి ప్రాయం సేకరించి, ప్రజలు సంతోషంగా ఉన్నారా లేదా అనేది తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల అనుమతితో ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించి, వారి ఫోన్లో మిస్సిడ్ కాల్ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా టిడిపిపై ఆయన విమర్శలు చేశారు. ప్రజ లతో పాటు టిడిపి నాయకులు సైతం ఆ పార్టీని నమ్మే పరి స్థితుల్లో లేరన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరులో 'జగనన్నే మా భవిష్యత్తు ' కార్యక్రమం నిర్వ హించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, గృహసార థులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇం టింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం జలాలు పురంలో గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమం నిర్వహించారు

విద్యతోనే మార్పు సాధ్యం: ఎమ్మెల్సి ఏసురత్నం

ప్రజాశక్తి-మాచర్ల

ఆర్థిక,సామాజిక,రాజకీయ, విద్యా రంగాలలో వడ్డెరులు వెనుకబడి ఉన్నారని, గత ప్రభుత్వాలు వీరిని ఓటు బ్యాంక్‌గా వాడు కున్నాయని ఎమ్మెల్సి చంద్రగిరి ఏసురత్నం అన్నారు. మాచర్ల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహోత్స వాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్దుల పోటీలకు రెండవ రోజు కార్య క్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సి అయిన తరువాత తొలిసారిగా మాచర్లకు వచ్చిన ఆయనకు స్థానిక కెసిపి అతిథి గృహంలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ ఏ సామాజిక వర్గంలో అయిన మార్పు విద్యతోనే సాధ్య మని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి వడ్డెరలకు సముచిత స్థానం కల్పిస్తున్నా రని ప్రశంసించారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, నాయకులు బత్తుల రాజా, బత్తుల ఏడుకొండలు, డేరంగుల కోటేశ్వర రావు, ఓర్సు కాశయ్య, చల్లా కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు.. టిడ్కో గృహాల సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-నరసరావుపేట

తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను చూపుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాస్‌రెడ్డికి నరసరావుపేట నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు సెల్ఫీ చాలెంజ్ విసి రారు. ఈ సందర్భంగా అరవింద బాబు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో 1504 టిడ్కో గృహాలు నిర్మించామని, వాటికి తమ హయాం లోనే మౌలిక సదుపాయాల కల్పించామని చెప్పారు. టిడ్కో గృహాలకు లబ్ధి దారులు తమ వాటా రూ.50 వేలు చెల్లించారన్నారు. వైసిపి అధికారం లోకి వచ్చాక లబ్ధిదారుల పేర్లు మార్చి, వైసిపికి చెందిన 400 మంది అన ర్హులకు అక్రమంగా ఆ ఇళ్లను కట్టబెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు భయపడాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు అందేలా న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో పేదలకు ఎన్ని పక్కా ఇళ్లు నిర్మించారో చెప్పాలని ఎమ్మెల్యే ను ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, బండారుపల్లి విశేశ్వరరావు,కొల్లి బ్రహ్మయ్య,కడియం కోటి సుబ్బా రావు, అల్లంశెట్టి మోహన్ రావు,పొత్తూరి శ్రీనివాస్ రావు,తిరుమలశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా వ్యాప్తంగా జరగనున్న వామ పక్షాల ఇంటింటి ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పిలుపు నిచ్చారు. స్థానిక సిపిఐ కార్యా లయంలో శనివారం సిపిఐ నరస రావు పేట నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వా లను ఇంటికి సాగ నంపడం కోసం ఈ నెల 14న డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పించి సభలు నిర్వ హించి 30వ తేదీ వరకు ఇంటింటి ప్రచార యాత్రను నిర్వహిస్తామని చెప్పా రు. సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్య దర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని, జగనన్న కాలనీల పేరుతో ఏ ఒక్క పేదవారికి ప్రభుత్వ పరంగా ఇల్లు కట్టలేదని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ప్రభు త్వమే పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఎస్.దేవి, ఎఐటియుసి నాయకులు యు. రంగయ్య, ఆర్. అంజిరెడ్డి, ఎస్.దేవి, సిహెచ్ శ్రీని వాసరెడ్డి, అచ్యుత రెడ్డి, యు.రాజు, టి. సాంబయ్య, వెంకయ్య, నాగేశ్వరరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

'శివశక్తి' ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-వినుకొండ

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేం దుకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ముందుకు రావడం జరిగిందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు అన్నారు. పట్టణంలోని పలు ప్రాం తాల్లో శనివారం చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజ నేయులు మాట్లాడుతూ నియోజకవర్గం లోని అనేక గ్రామాల నుండి వినకొండకు వచ్చే ప్రజల దప్పికను తీర్చేందుకు తాగునీటిని ఈ చలివేంద్రాల ద్వారా అందజేస్తామని చెప్పారు. గత ఇరవైఐదేళ్లుగా శివశక్తి ఫౌండేషన్ ప్రజలకు అనేక సేవలందిస్తోందని చెప్పారు. ప్రతి ఏటా వేసవికాలంలో పటంలోని ప్రధాన వీధుల్లో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం జరిగిందని అదేవిధంగా ఈ ఏడాది చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మేనేజర్ జీవీ రమణారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పివి సురేష్ బాబు, పత్తి పూర్ణ చంద్రరావు, పల్లె మీసాల దాసయ్య, పెమ్మసాని నాగేశ్వరరావు ,దాసరి కోటేశ్వరరావు, అన్నయ్య, నారాయణ, సుంకర శ్రీనివాసరావు, జానీ, ఫరీద్, భత్తుల గోవిందరాజులు, గోల్డ్ కరిముల్లా, ఖలీల్, వీర గంధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు నడిచేదెలా...!

- రోడ్డు పగలగొట్టి...పూడ్చ కుండా వదిలేసిన వైనం
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- త్వరతగతిన పూడ్చాలని విన్నపాలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో నూతనంగా వాటర్ పైప్‌లైన్లు వేసేందుకు తీసిన రోడ్లను పూడ్చకుండ అంతే వదిలేశారు.దీంతో ఆ రోడ్డులో వాహనాలు నడపాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవౌతున్నారు. ఈ గుంటలలో వాహనాలు జారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, స్థానిక నివాసులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా పట్టణంలోని అన్ని సీసీ రోడ్లను కార్పొరేషన్ అధికారులు పగలగొట్టి ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్లు వేశారు. ఆయితే పగలగొట్టిన రోడ్లకు మరమ్మతులు చేయకుండా అంతే వదిలేశారు. దీని వలన నిత్యం రోడ్లపై తిరిగే వాహనదారులు జారి గోతుల పడిపోయి గాయాల పాలవుతున్నారు. నెలలు తరబడి అవుతున్నప్పటికీ పగలగొట్టిన రోడ్లను మాత్రం కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేయకుండా అంతే వదిలివేశారు. కొన్ని ప్రాంతాల్లో పగలగొట్టిన రోడ్డుపై గుంటలు పడిపోయాయి. అధికార యంత్రాంగం సైతం నిత్యం ఈ రోడ్లపైనే తమ తమ వాహనాల్లో వెళుతూ ఉంటారు గానీ, పగిలిన రోడ్ల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. మంగళగిరి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పే పాలకులు, అధికార యంత్రాంగం వాటర్ పైప్ లైన్ పేరుతో పగలగొట్టిన రోడ్ల గురించి మాత్రం పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేషన్ అధికారులు సైతం నిత్యం పట్టణంలో పర్యటిస్తున్నప్పటికి ఈ రోడ్లకు మరమ్మతులు చేయించకుండా వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పట్టణ వాసులు, స్థానిక నివాసులు,వాహనదారులు కోరుతున్నారు.

తెనాలి రోడ్డులోని ఇస్లాంపేట వద్ద పగలగొట్టిన రోడ్డు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో శనివారం తిరుమల శెట్టి నాగలక్ష్మి, మలిశెట్టి నాంచారమ్మ గార్ల సహకారంతో గ్రామంలోని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమా శంకర్ మాట్లాడుతూ అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయటం అలాగే ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం ఎంతో గొప్పవిషయమన్నారు. అన్నదానానికి సహకరించిన తిరుమల శెట్టి నాగలక్ష్మి మలిశెట్టి నాంచారమ్మ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శి గుడివాడ పవన్ తదితరులు పాల్గొన్నారు అన్నదానం రక్తదానం చేయాలి అనుకున్న వాళ్లు తిరుమల శెట్టి ఉమాశంకర్ 8333089722నెంబర్‌కు సప్రందించాలని కోరారు.

తెలుగు టాలెంట్ అవార్డుకు ఎంపికైన ఆళ్ల

ప్రజాశక్తి- తెనాలి

ఆళ్ల నాగేశ్వరరావు

పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, కవి ఆళ్ళ నాగేశ్వరరావు తెలుగు టాలెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య నిర్వాహకులు సాహితీ రంగానికి సంబంధించి తెలుగు టాలెంట్ అవార్డుకు ఎంపిక చేసినట్లుగా శనివారం ఆయన తెలిపారు. ఆ సంస్థ వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి డా. గణగళ్ళ విజయ్ కుమార్ పంపిన ఎంపిక ధ్రువీకరణ పత్రాన్ని శనివారం అందుకున్నట్లు చెప్పారు. సాహితీ రంగంలో నాలుగు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా తనను అవార్డుకు ఎంపిక చేశారని, ఈ నెల 17న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివార్సిటీలో అవార్డు ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు.

కర్జూరాలను అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

బాలింతలకు కర్జూరం పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి:రంజాన్ మాసం పురస్కరించుకొని జమాఇతే-ఇస్లామీ-హింద్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి గైనకాలజీ వార్డులో సుమారు 154 మంది గర్భిణీ, బాలింతలకు నాణ్యమైన ఖర్జూర పండ్లు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అందచేశారు. ఖర్జూరపు పండ్లు బాలింతలకు బలాన్ని ఇస్తుందని ఆమె అన్నారు. జమా అతే ఇస్లామి హింద్ సంఘ సేవా కార్యవర్గ సభ్యులు అబ్దుల్‌రషీద్, హాఫిజున్, సీమా,ముస్తఫా పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యకళాకారిణి వసంత దుర్గకు సత్కారం

వసంత దుర్గ, రాంబాబు, సూర్యనారాయణ లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలు, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును శనివారం కొత్తపేట దేవభక్తుని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి,నృత్యగురువు పెసర్లంక వసంతదుర్గను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వక్తలు ఆళ్ల రాంబాబు, తాడేపల్లి సూర్యనారాయణ వ్యక్తిగత, ప్రజాజీవితంలో అన్నగా ఎన్టీఆర్ అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు,డి.భాస్కర్, కె.నాగభూషణం, వి. శివప్రసాద్, కె. ప్రభాకరరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

ప్రజాశక్తి -మంగళగిరి: టిడ్కో గృహాల వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ తెలుగు మహిళ ఆధ్వర్యంలో మాటామంతి కార్యక్రమం టిడ్కో గృహాల వద్ద నిర్వహించారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి టీ జానకి దేవి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఇంజమూరి ఆశాబాల, ఎం.వైష్ణవి, యు.దుర్గా మల్లేశ్వరి పాల్గొన్నారు.

'వైసిపికి చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి-మంగళగిరి

మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రంలో వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్క బీసీ నేత ఆకుంటిత దీక్షతో పని చేయాలని బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనంజయరావు పలువురు బీసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో బీసీ ఫేడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన జరిగిన బిసిసెల్ జోన్ 3 సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 11న జరిగే మహాత్మజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను, రాష్ట్ర బీసీసెల్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ గుంటూరులో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుంటూరుజిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, బిసి సెల్ జోన్3 కో-అర్డినేటర్ రమాదేవి,బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు రేఖ సుధాకర్ గౌడ్, కాండ్రు శ్రీనివాసరావు, మాధవ పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ' పోస్టర్‌ను చూపుతున్న నాయకులు

టిడిపితోనే బీసీల అభివృద్ధి

ప్రజాశక్తి -మంగళగిరి

రాష్ట్రంలో టిడిపితోనే బీసీల అభివృద్ధి జరిగిందని రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వహణ కార్యదర్శి ఇంజమూరి ఆశాబాల అన్నారు. శనివారం రాత్రి 14వ వార్డులో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమంలో. ఆశాభాల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో బీసీలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, ఇంజమూరి చంద్రశేఖర రావు, కె. నాగార్జున, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న రాజధాని రైతులు, మహిళలు

పేదల ఓట్లు కొల్లగొట్టడమే జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలో పేదలకు సెంటు స్థలం పంపిణీ చేసి వారి ఓట్లను కొల్లగొట్టడమే లక్ష్యం వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని రాజధాని రైతులు ఆరోపించారు. శనివారం 1208వ రోజు చేపట్టిన దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను నాలుగేళ్లైనా పేదలకు అప్పజెప్పలేదని, విచారణ పేరుతో దళితులు, ఇతర వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులకు ఇప్పటివరకు కౌలు చెల్లించలేదన్నారు.రాజధాని గ్రామాల్లోని పేదల బాగోగులను గాలికొదిలేసి ఇతర ప్రాంతాల పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఉద్దరిస్తామని ప్రభుత్వం ప్రచారార్భాటం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని నినాదించారు. తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం,నెక్కల్లు తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి, కోర్టు తీర్పును అమలు చేయాలంటూ నినాదాలు చేశారు.

ఓటు నమోదు అందరి బాధ్యత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: ఓటరుగా నమోదు చేసుకోవటం 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి బాధ్యత అని కెఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు అన్నారు. శనివారం తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలోని ప్రాతూరులో కెఎల్‌యు లా కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఓటు నమోదుపై ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రాతూరులోని పాఠశాలలో విద్యార్థులకు సామాజిక సేవ, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా మొబైల్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని, లేదా సమీపంలోని సచివాలయంలో కానీ మీ సేవా కేంద్రాలలో కానీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ సలహాదారులు డాక్టర్ హాబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్‌లు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రోవైస్ ఛాన్స లర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, శాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ, అధ్యాపకురాలు కియాసర్కార్, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆర్‌టిఇ ద్వారా ఉచిత సీట్లకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని అర్హులైన పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం సెక్షన్12(1) ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు కేటాయించి, సామాజికంగా వెనుకబడిన, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన పిల్లలకు ఉచితంగా విద్యను అందించటానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. అర్హులైన ఐదు నుండి ఆరేళ్లలోపు పిల్లలు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచితంగా ఒకటో తరగతిలో ప్రవేశంపొందటానికి ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా **www.cse.ap.gov.in/RTE** వెబ్‌సైట్ ద్వారాగానీ, సమీపంలోని సచివాలయం ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాల కోసం డిఇఒ, ఎంఇఒ కార్యాలయాల్లోగానీ టోల్‌ఫ్రీ నంబర్ 14417, ఇండస్ యాక్షన్ హెల్ప్‌లైన్ నెంబర్ 9502666864 నంబరులో సంప్రదించాలన్నారు.

విశాఖలో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

గుంటూరు జిల్లా నుండి 20 మంది క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి -మంగళగిరి

ఈనెల 22,23 తేదీలలో విశాఖపట్నం లోని ఆంధ్ర యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదవ సబ్ జూనియర్ మాస్టర్స్ అండ్ బెంచ్ ప్రెస్ మెన్ అండ్ ఉమెన్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ 2023 ఛాంఎయన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా జట్టును శనివారం మంగళగిరి మాస్టర్స్ జిమ్ సెంటర్లో ఎంపిక జరిగినట్లుగా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన కార్యదర్శి జి పుల్లేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలకు తెనాలి, గుంటూరు, పొన్నూరు మంగళగిరి ప్రాంతాల నుండి జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో ఎనిమిది మంది మహిళా, 12 మంది పురుష క్రీడాకారులుఎంపికైనట్లుగా పుల్లేశ్వర తెలిపారు. కోచ్‌లుగా షేక్ సంధాని, ఎండి కమురుద్దీన్, పి భాస్కర్, జి సాయి రేవతి వ్యవహరిస్తారని తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని తదితరులు

హెటెరో ఫార్మసీలో 18 మంది కృష్ణవేణి విద్యార్థులకు కొలువులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఫార్మసీ రంగంలో దిగ్గజ కంపెనీ అయిన హెటెరో సంస్థ స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొనగా కంపెనీ ప్రతినిధులు గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలలో నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ చాటిన 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ 2.70 లక్షలు వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు కంపెనీ హెచ్‌ఆర్ విజయ్ తెలిపారు. డిగ్రీ పూర్తవ్వగానే ఉద్యోగంలో చేరుతారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిపిఒ ఎం బాల కోటేశ్వరావు హెచ్‌ఆర్ విజయ్ పాల్గొన్నారు.

జియాలజీ లెక్చరర్ నర్రాకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : స్థానిక నిడుబ్రోలు పిబిఎన్ కళాశాల జియాలజీ అధ్యాపకునిగా పనిచేసిన నర్రా శ్రీనివాసరావుకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. నిడుబ్రోలు పిబిఎన్ కళాశాల జియాలజీ అధ్యాపకునిగా పనిచేస్తూ ఇటీవల రాజమండ్రిలోని అటానమస్ గవర్నమెంట్ కళాశాలకు ఆయన బదిలీపై వెళ్లారు. లెక్చరర్ నర్రా శ్రీనివాసరావుకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసింది. 'కడప అంతర్గత ప్రావిన్స్ ఆల్కలైన్ అగ్ని శిలలు' అనే అంశంపై చేసిన విస్తృత పరిశోధనకు ఈ డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ వి మాధవన్, ప్రొఫెసర్ కే డేవిడ్ గైడ్‌లుగా వ్యవహరించారు. నర్రా డాక్టరేట్ డిగ్రీ పొందటం పట్ల పివిఎన్ కళాశాల, రాజమండ్రి అటానమస్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, ఆయన మిత్రబృందం శనివారం తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న తనకు మరింత బాధ్యత పెరిగింది అన్నారు.

14 నుంచి రాజధానిలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరి

ప్రజాశక్తి - తుళ్లూరు

సమావేశంలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు ఎం.రవి, ముప్పాళ్ల శివశంకరరావు తదితరులు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, అభివృద్ధి వినాశనకర, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ అధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30 వరకు ప్రచారభేరి నిర్వహించడం జరుగుతుందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఐ తాడికొండ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు తెలిపారు. తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబూరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో రవి, శంకరరావు మాట్లాడుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రచారభేరి కార్యక్రమం జరుగుతుందని,14న బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తుళ్లూరులోని లూథరన్ చర్చి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రచారభేరి మొదలవుతుందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం సామాన్యులపై భారాల మీద భారాలు వేస్తూ దేశ సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని విమర్శించారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టి ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలు అమలు, పోలవరం, ప్రత్యేకహోదా తదితర అంశాల్లో బిజెపి రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేసేందుకు కుటిల యత్నాలు చేస్తోందని అన్నారు. మరో ప్రక్క రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, మోడీకి అనుకూలంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజానీకం పై విద్యుత్ చార్జీలు, చెత్త పన్ను, ఆస్తి పన్ను పెంచి భారాలు వేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 14 నుంచి 30 వరకు రాజధాని గ్రామాల్లో జరిగే ప్రచారభేరి కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎర్రమనేని శ్రీనివాసరావు, గడ్డం కష్ణ,షేక్ జానీ,కుం భా ఆంజనేయులు, పాబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్ల రాజకీయంపై అయోమయం

వీక్షణం

వైసిపి చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభం అయింది. చేతిలో సంచి, సిఎం జగన్ స్టిక్కర్లు, హామీల అమలు కరపత్రాలు, అయిదు ప్రశ్నలతో కూడిన బుక్‌లెట్లు చేతబూని వైసిపి నాయకుల బృందాలు ఇంటింటికి వెళ్తున్నారు. ప్రజా మద్దతు పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు, వైసిపి నాయకులు ఒక్కసారిగా రావడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. మా నమ్మకం నువ్వే అనే స్టిక్కర్లు అతికిస్తుంటే ఏం చెప్పాలో తెలియడం లేదని మహిళలు వాపోతున్నారు. ఇంటి గోడలపై, సెల్ ఫోన్లపై అంటిస్తున్న స్టిక్కర్లు ప్రజల్లో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. స్టిక్కర్లు అంటిస్తే తమను ఇతర పార్టీల వారు వైసిపి వారుగా ముద్ర వేసి ఇబ్బంది పెడతారోమో.. .స్టిక్లర్లు వేయవద్దు అంటే తాము వైసిపికి వ్యతిరేకం అని అధికార పార్టీ వారు ముద్ర వేస్తారోమోనని ప్రజలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వ పథకాలు తీసుకున్నంత మాత్రనా ఇంటికి స్టిక్కర్లువేయడం ఏమిటని కొంత మంది ప్రశ్నిస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎన్నికలప్పుడు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే ప్రజలు అధికంగా ఉంటారు. అలాంటిది ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లు వేసుకుంటే భవిష్యత్తులో మరో పార్టీ వారు కూడా వచ్చి స్టిక్కర్లు, జెండాలు తీసుకోమంటే ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమం వైసిపికి ముందుస్తు ఎన్నికల ప్రచారానికి బాగా ఉపయోగపడుతుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల్లో పరిణామాలు వేగంగా మారుతు న్నాయి. వివిధ నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి నేతలకు అసమ్మతి వ్యవహారాలు పెరుగుతు న్నాయి. వైసిపి, టిడిపిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఉండగానే తాము రంగంలో ఉన్నామని కొత్త నేతలు తెరమీదకు వస్తున్నారు. సామాన్య ప్రజలను విందు ఏర్పాటు చేస్తున్నారు. సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి ఇటీవల భారీ విందు ఏర్పాటు చేశారు. తాను ఈసారి వైసిపి తరుపున సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. మంత్రి అంబటి రాంబాబు ఈ నియోజక వర్గంకు ప్రాతినిధ్యం వహిస్తున్నా విజయ భాస్కరరెడ్డి చేసిన ప్రకటన పార్టీలో అసమ్మతి రాజకీయాలకు ఆజ్యం పోసింది. అలాగే చిలకలూరిపేటలో టిడిపి ఇన్‌ఛార్జిగా మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పనిచేస్తుండగా ఆయనకు పోటీగా రియల్టర్ భాష్యం ప్రవీణ్ ఈనెల 16వ తేదీన రంజాన్ తోఫా పంపిణి, 20న ఇఫ్తార్ విందు ఇస్తారని ప్రచారం జరిగింది. పేట స్థానంపై దృష్టిపెట్టిన ప్రవీణ్ ఈ నియోజకవర్గంలో నిర్వహించనున్న రాజకీయ కార్యకలాపాలపై పత్తిపాటి పుల్లారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఆయన పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడారు. ఇలాంటి వారిని ప్రోత్సహించ వద్దని నిర్మొహ మాటంగా చెప్పారు. భాష్యం ప్రవీణ్ సన్నిహితులంతా గత ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన విడదల రజనీకి సహకరిం చిన వారేనని పుల్లారావు అనుచరులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టిడిపికి సంబంధించి గురజాల, పెదకూరపాడు, గుంటూరు పశ్చిమలో కూడా కొత్త నాయకులు అనేక మంది రంగ ప్రవేశం చేసి ఇన్‌ఛార్జిలను ఇబ్బంది పెడుతున్నారని సీనియర్ నేతలు వాపోతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

పేద న్యాయవాదులను ఆదుకుంటాం : మాజీ మంత్రి డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాట్లాడుతున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

పేద న్యాయవాదులను ఆదుకున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ అన్నారు. శనివారం బృందావన్ గార్డెన్స్ లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయం లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సి. డి. భగవాన్ అధ్యక్షతన జిల్లా సమావేశంల నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్య వర ప్రసాద్ ప్రసంగిస్తూ 'లా నేస్తం' ద్వారా పేద న్యాయవాదులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో న్యాయవాదులతో మహాసభను ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆహ్వానించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వాల కంటే వైసిపి ప్రభుత్వం లో న్యాయవాదులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు.రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ లీగల్ సెల్ కు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ఎప్పుడు ముందు ఉంటానని హామీ ఇచ్చారు. నిరుపేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని ఆయన అన్నారు. యం యల్ సి మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ న్యాయ విభాగంలో వివిధ పదవులు పొందిన వారంతా బాధ్యతగా పని చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో లీగల్ సెల్ ప్రజల పక్షాన నిలబడి సమస్యలను పరిష్కరించాలి. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పార్టీ న్యాయవాదులు వెనక్కి తగ్గకుండా పని చేసారని ఆయన గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ సభ్యులు రోళ్ల మాధవి, వి బ్రహ్మారెడ్డి, పి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, దాసరి శ్రీధర్, కాసు వెంకట రెడ్డి, వి రాజశేఖర్ రెడ్డి, సూరిబాబు, జి సుబ్బారెడ్డి, సభ్యులు హ్యాబిద్, వీర మణి, వేముల ప్రసాద్, పచ్చల అనిల్ కుమార్, బాల మురళీకష్ణ రాజారావు, సురేష్ చంద్ర, మోహన్ రెడ్డి, పురుషోత్తం, మందపాటి శేషగిరి రావు, పాల్గొన్నారు.